# జనం రిపోర్టర్
తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను.

Janam Reporter

ఆంధ్ర, తెలంగాణలో వెలువడుతున్న జనం రిపోర్టర్ దినపత్రికకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల రిపోర్టర్స్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. తెలుగు భాషపై అవగాహన, వార్తలు వ్రాయగల సత్తా ఉన్న కొత్త వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

మరిన్ని వివరములకు: www.janamreporter.com

9398156948



సంపుటి: 01 | సంచిక: 174 | ఎడిటర్: మార్పు సాయికుమార్ | గురువారం, 17 అక్టోబర్, 2024 | పేజీలు 08 | వేల రూ: 05/-

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam, VishakaPatanam, Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor, Kadapa, Anantapuram, Hyderabad


# సిద్దిపేటలో ఔరా అనిపిస్తోన్న అక్కాచెల్లెళ్లు

- ఇద్దరు కాదు ఏకంగా నలుగురు అక్కాచెల్లెళ్లు వైద్యులుగా మారేందుకు సిద్ధం
- ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా వారు మా ఇష్టాన్ని కాదనకుండా ఎంబీబీఎస్ చదవిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా వారిని డాక్టర్లగా నిలబెడతామని అంటున్నారు
- పిల్లలు అంటే ఇలా ఉండాలని పలువురు తల్లిదండ్రులు అనుకుంటున్నారు.

మిగత 2 లో




## రహదారుల విస్తరణకు బ్రేక్!

- ముందుకు సాగని నాలుగు లేన్ల రోడ్ల పనులు
- ప్రారంభించి ఏడాదైనా పూర్తికాని వైనం
- యాచారం మండలంలో రోడ్ల విస్తరణ పనులకు మోక్షమెప్పుడో?
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు




యాచారం, అక్టోబరు 16 : బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన ఫార్మాసిటీ రోడ్డు పనులు మధ్యంతరంగా ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితం పనులు చేపట్టగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్అండ్బీ రోడ్డు పనులు ఆగిపోయాయి. కందుకూరు మండలంలోని మీర్ఖాన్పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా విస్తరణ పనులు చేపట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.78 కోట్లు కేటాయించింది. నందివనపర్తి నుంచి మేడిపల్లి ఫార్మాసిటీ వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణకు రూ.48 కోట్లు కేటాయించింది. శ్రీశైలం జాతీయ రహదారి నుంచి మీర్ఖాన్పేట సమీపం వరకు రూ.32 కోట్ల నిధులతో నాలుగు లేన్ల రహదారి పూర్తయింది. అయితే, ఈ రహదారిపై పలుచోట్ల డివైడర్లు పాడైపోయాయి. రోడ్డు పనుల పూర్తికి నిధులు కేటాయించారా? లేకపోతే అసలు విడుదల కాలేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మిగత 2 లో

## చెన్నైని అతలాకుతలం చేస్తున్న వరదలు

- హైదరాబాద్ భవిష్యత్తులో మరో చెన్నై కానుందా?
- హైడ్రా కూల్చివేతలపై ఆసక్తికర చర్చ





చెన్నై నగరాన్ని వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. తమిళనాడు రాజధానితో పాటు దాని పరిసర జిల్లాల్లో రెండు రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైలో పలు ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. వరదలు పెద్ద ఎత్తున పోటెత్తడంతో నగరవాసులు నరకం అనుభవిస్తున్నారు.

# ఐఏఎస్‌ల పిటిషన్‌ను డిస్మిస్ చేసిన తెలంగాణ హైకోర్టు

- ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని తేల్చి చెప్పిన న్యాయస్థానం
- ఆమ్రపాలి సహా నలుగురు ఐఏఎస్‌లను రిలీవ్ చేయనున్న తెలంగాణ ప్రభుత్వం
- ఇలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సమస్య మరింత జఠిలం అవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది.

మిగత 2 లో



కేంద్రం ఇటీవల బదిలీ చేసిన ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టులోనూ ఊరట దక్కలేదు. క్యాట్ తీర్పును సవాల్ చేస్తూ ఏడుగురు ఐఏఎస్ అధికారులు తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఐఏఎస్ అధికారులు రొనాల్డ్ రాస్, వాకాటి కరుణ, ఆమ్రపాలి కాటా, వాణీప్రసాద్, హరి కిరణ్, శివశంకర్, సృజన పిటిషన్ దాఖలు చేశారు.

## కూకట్ పల్లిలో ఎకరం భూమి కొన్న వ్యాపారి

- 6 కోట్లకు గానూ 3 కోట్లు చెల్లింపు
- చివరికి ఆ స్థలం చెరువులో ఉన్నట్టు తెలిసి షాక్




హైదరాబాద్‌లో ఖరీదైన ఏరియాల్లో కూకట్ పల్లి ఒకటి. అక్కడ భూములు, ఇండ్ల రేట్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. అక్కడి జీవన విధానం కూడా అంతే లగ్జరీగా ఉంటుంది. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, విద్యాసంస్థలు కూడా అక్కడ ఎక్కువగా ఉండటంతో పాటు గచ్చిబౌలి, మియాపూర్ లాంటి వర్కింగ్ ప్లేస్‌లకు అతిదగ్గరగా ఉండటం వల్ల.. కూకట్‌పల్లి ప్రాంతానికి అంత డిమాండ్ ఉంటుంది.

# ఏపీలో భారీ వర్షాలు

- పలు జిల్లాలలో స్కూళ్లకు సెలవు
- తీరం దాటనున్న వాయుగుండం
- గురువారం కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది.
- మరోవైపు తెల్లవారుజామున వాయుగుండం తీరం దాటుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.
- అనంతరం క్రమంగా బలహీనపడుతుందని అంచనా వేసింది.

మిగత 2 లో



## నేడు కొత్త టీచర్లకు పోస్టింగులు



తెలంగాణలో డీఎస్సీ-2024 ద్వారా నియామక పత్రాలు అందుకున్న 10,006 మంది కొత్త టీచర్లకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ అధికారులు పోస్టింగులు ఇవ్వనున్నారు. నూతన టీచర్లు ఆయా డీఈఓలు సూచించిన కార్యాలయాల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. వారు తమకు కేటాయించిన పాఠశాలల్లో ఈనెల 16వ తేదీన చేరాల్సి ఉంటుంది. పోస్టింగ్‌ల కేటాయింపు నేడు దాదాపు పూర్తవుతుందని, ఏవైనా మిగిలితే వాటికి బుధవారం కూడా జరుగుతుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

## ఈ ప్రాంతాల్లో మద్యం బ్యాన్




ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతిలో కొన్ని ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటుపై నిషేధం విధించింది. భక్తులు తిరుపతి మీదుగానే తిరుమలకు వెళ్లాల్సి ఉంది. తిరుపతి నుండి తిరుమలకు వెళ్లే మార్గాలలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, విష్ణు నివాసం, కపిలతీర్థం, అలిపిరి, స్విమ్స్, రుయా ఆసుపత్రి సర్కిల్ వరకు ఉన్న బైపాస్ రోడ్డులో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు.

# ఏపీలో అన్న క్యాంటీన్ల భవనాలకు రంగు

- హైకోర్టును ఆశ్రయించిన చంద్రశేఖర్ రెడ్డి
- కోర్టు కీలక వ్యాఖ్యలు.. విచారణ వాయిదా

ఆంధ్రప్రదేశ్‌లో అన్న క్యాంటీన్‌ల భవనాలకు పసుపు రంగులు వేయడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అన్న క్యాంటీన్లకు టీడీపీ రంగులు వేస్తున్నారంటూ ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీడీపీకి సంబంధించిన పసుపు రంగును వేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రస్తావించారు.

మిగత 2 లో



# రహదారుల విస్తరణకు బ్రేక్!

మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరించడానికి రూ.78 కోట్లతో పనులు చేయాలని అధికారులు గతంలో నిర్ణయించారు. మూడు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డును పూర్తిగా తొలగించి మట్టి రోడ్డు వేశారు. ఏడాది కాలంగా పనులు ముందుకు సాగడంలేదు. దాంతో అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. ప్రయాణం నరకంగా మారింది. నజ్దిక్‌సింగారంలో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లను కొన్ని కూల్చడానికి అధికారులు గతేడాది గుర్తులు పెట్టారు. ఇళ్లను కూల్చకుండా నజ్దిక్‌సింగారం, నందివనపర్తి గ్రామాలకు దూరంగా కొత్తగా రోడ్డు వేయడానికి గతంలో భూసేకరణ చేయడానికి అధికారులు పూనుకోగా.. ఎకరానికి రూ.35లక్షల పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేయడంతో భూసేకరణ పనులు ఆగిపోయాయి. మొగ్గుళ్లవంపు శివారు నుంచి తిరుమలేషుని గుట్ట వరకు భూసేకరణ చేసి రోడ్డు వేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా, మొగ్గుళవంపు నుంచి యాచారం అంబేడ్కర్ విగ్రహం వరకు నాలుగు లేన్ల రహదారి వేస్తారా అని స్థానికులు కలత చెందుతున్నారు. ఇదే జరిగితే కనీసం 30 ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని అక్కడి వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మొగ్గుళ్లవంపు శివారు నుంచి నేరుగా తిరుమలేషుని గుట్ట వరకు మరో రోడ్డు వేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదు.

కొత్తగా రోడ్డు వేయడానికి యాచారం లేదా నందివనపర్తిలోని రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. మీర్‌ఖాన్‌పేట సమీపం నుంచి నజ్దిక్‌సింగారం వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా గుంత లు పడింది. మట్టి రోడ్డుపై అడుగడుగునా గుంతలుండడంతో ఆటో రెండు రోజులకోసారి రిపేర్‌కొస్తుంది. దాంతో మేం సంపాదించిన దానికంటే ఆటో మరమ్మతులకే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అధికారులు త్వరితగతిన రహదారిని బీటీ రోడ్డుగా మార్చి ఇబ్బందులు తొలగించాలి. మీర్‌ఖాన్‌పేట నుంచి నజ్దిక్‌సింగారం గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును మట్టి రోడ్డుగా మార్చడంతో చాలా వరకు గుంతలు ఏర్పాడ్డాయి. దాం తో బస్సుల కమాన్ కట్టలు విరిగిపోతున్నా యి. టైర్లు తరచూ పాడవుతున్నాయి. అధికారులు రోడ్డును బాగు చేస్తే ఎలాంటి ఇబ్బందులుండవు. 15 నిమిషాల్లో మూడుకిలోమీటర్లు వెళ్లే బస్సుకు ఆ రోడ్డుపై గంట సమయం పడుతోం ది. దాంతో సకాలంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చలేకపోతున్నాం.

# ఐఏఎస్‌ల పిటిషన్‌ను డిస్మిస్ చేసిన తెలంగాణ హైకోర్టు

ఈ పిటిషన్ మీద విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు.. క్యాట్ ఆదేశాలను సమర్థించింది. డీవోపీటీ ఉత్తర్వుల ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఐఏఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను డిస్మిస్ చేసింది. లంచ్ మోషన్ పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాసేవ కోసమే ఐఏఎస్‌లు ఉన్నారన్న హైకోర్టు.. కేంద్రం ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడకు వెళ్లాలని సూచించింది. ట్రిబ్యునల్ పిటిషన్ కొట్టేసిందని కోర్టులకు రావడం కరెక్ట్ కాదని పేర్కొంది. మరోవైపు క్యాట్‌లో నవంబర్ నాలుగో తేదీన విచారణ ఉందన్న ఐఏఎస్ అధికారుల తరుపు న్యాయవాది.. ఈ పదిహేను రోజుల పాటు రిలీవ్ చేయవద్దని కోరారు. అయితే స్టే ఇస్తూ పోతే ఈ వ్యవహారం ఎప్పటికీ తేలదన్న హైకోర్టు.. క్యాట్‌లోనూ సీనియర్ అధికారులు ఉంటారని పేర్కొంది. ఇలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సమస్య మరింత జఠిలం అవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. క్యాట్ ఆదేశాలను సమర్థిస్తూ ఐఏఎస్ అధికారుల పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఐఏఎస్ అధికారులు వెంటనే డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని హైకోర్టు సూచించింది. బాధ్యతాయుతమైన అధికారులుగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని అభిప్రాయపడింది. మరోవైపు డీవోపీటీ ఉత్తర్వుల ప్రకారం అక్టోబర్ 16 అంటే ఇవాళ సాయంత్రంలోగా వారంతా వారి సొంత రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉంది. క్యాట్ సైతం ఇదే ఆదేశాలు ఇచ్చింది. అయితే క్యాట్ ఆదేశాలను సవాల్ చేస్తూ వీరంతా హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా ఊరట దక్కలేదు. క్యాట్ ఆదేశాలను సమర్థిస్తూ హైకోర్టు వీరి పిటిషన్ డిస్మిస్ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నలుగురు ఐఏఎస్‌లను (ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్, రొనాల్డ్ రోస్) కాసేపట్లో రిలీవ్ చేయనుంది.

ఆమ్రపాలి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కొనసాగుతుండగా.. మిగిలిన ముగ్గురు ఐఏఎస్‌లు మహిళా, శిశు సంక్షేమ శాఖ, టూరిజం, విద్యుత్ శాఖల ప్రధాన కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. వీరి స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్త వారిని నియమించనుంది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఎవరికి అవకాశం దక్కుతుందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.మరోవైపు ఏపీవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తూ ఉండటంతో ప్రభుత్వం కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత.. విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు, వర్షాల తీవ్రతను అనుసరించి అధికారులకు సూచనలు చేస్తున్నారు. మరోవైపు వాయుగుండం రేపు తీరం దాటిన తరువాత ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని హోం మంత్రి చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే పునరుద్ధరించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గాలులతో వృక్షాలు నేలకూలితే.. తొలగించడానికి జేసీబీలను సైతం సిద్ధం చేసినట్లు చెప్పారు.

# చెన్నైని అతలాకుతలం చేస్తున్న వరదలు

300 ప్రాంతాలు నీట మునిగాయి. సబ్‌వేలల్లో 3 అడుగుల మేర నీరు చేరింది. కొంత మంది నడుము లోతు నీళ్లలో వెళ్తున్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చెన్నై వరదలు తమిళనాడు వాళ్లకే కాకుండా, హైదరాబాద్ వాళ్లకు డిస్కషన్ పాయింట్ అయ్యింది. హైడ్రా పై కొంత మంది పోస్టులు చేస్తున్నారు. చెన్నైలో మాదిరిగా హైదరాబాద్ వాసులు ఇబ్బంది పడకూడదంటే నాలాలు, మూసీ నది వెంట ఆక్రమణలు తొలగించాల్సిందేనని పోస్టులు పెడుతున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ కామెంట్లు చేస్తున్నారు.భారీ వర్షాలు కురిసినప్పుడల్లా చెన్నై నగరంలో చాలా నష్టం వాటిల్లుతోంది. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి 'సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం' అయితే, రెండో కారణం 'ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు'. చెన్నై నగరం మీదుగా ఒకప్పుడు మూడు నదులు ప్రవహించేవి. అవి.. కూవం, అడయార్, కొసస్తలయార్ నదులు. కాలక్రమేనా ఈ 3 నదులు కాలుష్య కాసారంగా మారాయి. నాలాలు ఆక్రమణలకు గురై వరద నీరు వెళ్లిపోయేందుకు మార్గం కుంచించుకుపోయింది. కూవం నది అయితే పూర్తిగా డ్రైనేజీలా మారిపోయింది. చెన్నై నగరంలో నుంచి మూడు నదులు వెళ్తుంటే.. హైదరాబాద్ మీదుగా ఒకే ఒక్క నది 'మూసీ' ప్రవహిస్తోంది. మూసీ అంటే ఇప్పుడు మురికికూపంగా, కంపుకు ప్రతిరూపంగా కనిపిస్తుంది. కానీ, భాగ్యనగరానికి ఒకప్పుడు తాగునీరు అందించిందంటే.. ఇప్పటి తరం నమ్ముతుందా..? అలాంటి మూసీకి అలనాటి వైభవం తీసుకురావాలంటే ఎంత కష్టంతో కూడుకున్న పని. కనీసం.. ఈ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను ఇప్పటికైనా ఆపాల్సిన అవసరం లేదా..? మూసీ వెంట చాలా ప్రాంతాల్లో పేదలు, మధ్యతరగతి వారు ఎన్నో ఏళ్ల కిందటే ఇళ్లు నిర్మించుకున్నారు. మూసీ రివర్ బ్యాంకులో వందలాది ఇళ్లు ఉన్నాయి. అలాంటి వాళ్లందరినీ ఖాళీ చేయించి.. మూసీ నదిని శుద్ధి చేయాలని, వరదల నుంచి నగరాన్ని కాపాడాలని రేవంత్ రెడ్డి సర్కార్ భావిస్తోంది. మూసీ నది అభివృద్ధి కోసం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, విపత్తుల నిర్వహణ కోసం హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయితే, హైడ్రా కూల్చివేతలపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తోంది. చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చివేయడం పైనా మండిపడుతున్నారు. ఇదే సమయంలో హైడ్రాను సమర్థించే వాళ్లూ లేకపోలేదు. అయితే, పేదవాళ్లకు తగిన ప్రత్యామ్నాయం చూపించి, బఫర్ జోన్‌లలో ఉన్న నిర్మాణాలను కూల్చివేయాలని కోరుతున్నారు. అయితే, హైడ్రాతో ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకతను తొలగించేందుకు కాంగ్రెస్‌కు చెందిన సునీల్ కనుగోలు చేస్తున్న నష్ట నివారణ చర్యలో ఇదొక భాగమని బీఆర్ఎస్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి చెన్నై వరదల నేపథ్యంలో 'హైడ్రా' మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# కూకట్ పల్లిలో ఎకరం భూమి కొన్న వ్యాపారి

అయితే.. ఇక్కడ చాలా వరకు ఏపీతో పాటు మిగతా రాష్ట్రాల ప్రజలు, ఉద్యోగులే ఎక్కువగా నివాసం ఉండటం కూడా డిమాండ్‌కు కారణం. అలాంటి కూకట్‌పల్లి పరిసరాల్లోని ఓ ప్రాంతంలో స్థలం కొనాలనుకున్నాడు ఓ వ్యాపారి. అందుకోసం ఓ స్థలం కూడా చూశాడు. సగం వరకు డబ్బులు కూడా కట్టాడు. అప్పుడు.. సావు కబురు సల్లగా తెలిసింది. తాను కొనాలనుకున్న ఎకరం భూమి మొత్తం చెరువులోని ఎఫ్టీఎల్ పరిధిలోనే ఉందని తెలిసి కంగు తిన్నాడు. మణికొండకు చెందిన రంజిత్ కుమార్ (43) అనే వ్యాపారవేత్త కూకట్‌పల్లిలోని ఒక ఎకరం భూమిని విక్రయించారు. అయితే.. ప్రస్తుతం హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు హైడ్రా అధికారులు చేపట్టిన మహోత్తర యజ్ఞంలో భాగంగా.. అధికారులు సర్వే చేస్తుండగా.. రంజిత్ కుమార్ కొనుగోలు చేసిన భూమి అంబర్‌చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయం తెలిసి రంజిత్ కుమార్.. మొదట షాక్ అవ్వగా.. ఆ తర్వాత తేరుకుని సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తాను మోసపోయినట్టు.. తనకు జరిగిన మోసం గురించి వివరించాడు. 2021లో తాను స్థలం కొనాలని ప్రయత్నిస్తున్న సమయంలో.. కూకట్‌పల్లి పరిధిలోని బాగ్ అమీర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం తనను కలిశారని రంజిత్ కుమార్ తెలిపారు. తమకు బాగ్ అమీర్ గ్రామంలో 10 ఎకరాల 3 గుంటల భూమిని ఉందని తనతో చెప్పినట్టు వివరించాడు. దీంతో.. తాను ఓ ఎకరం భూమి కొనాలని నిర్ణయించుకుని వారితో చర్చలు జరపగా.. చివరికి 6 కోట్లకు ఎకరం భూమిని అమ్మేందుకు అంగీకరించినట్టు తెలిపారు. సేల్ అగ్రిమెంట్‌పై సంతకం చేసినప్పుడు మొదట రూ. 25 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించానని.. ఆ తర్వాత మార్చి 2022 నాటికి మొత్తం 2.9 కోట్లు చెల్లించానని రంజిత్ కుమార్ తెలిపారు. అయితే.. ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయమని కోరగా.. ఆ స్థలం అంబర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇదే విషయంపై వారిని అడిగితే.. భూసేకరణ పరిహారం, బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కుల (%ఱ=%) విక్రయం ద్వారా తన డబ్బును తిరిగి పొందవచ్చని మాయమాటలు చెప్పి తనను ఒప్పించారని రంజిత్ కుమార్ వివరించాడు. తనను మాయచేయటంతో.. తిరిగి పొందలేని జనరల్ పవర్ ఆఫ్ అటార్నీపై సంతకం చేసినట్టు చెప్పుకొచ్చాడు. తనకు స్థలం అమ్మిన వ్యక్తులు.. తనను తప్పుదోవ పట్టించి మోసం చేశారని రంజిత్ కుమార్ ఆరోపించారు. దీంతో.. రంజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు.. మోసం, నేరపూరిత బెదిరింపు, నేరపూరిత నమ్మక ద్రోహం కింద కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అభివృద్ధి ప్రయోజనాల కోసం భూమిని ప్రభుత్వం సేకరించే ప్రక్రియలో ఉందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అతను అంగీకరించిన మొత్తంలో ఎక్కువ భాగం చెల్లించిన తర్వాత మాత్రమే ఈ విషయం వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సిద్దిపేటలో ఔరా అనిపిస్తోన్న అక్కాచెల్లెళ్లు

సిద్దిపేట: జిల్లాకు చెందిన అక్కాచెల్లెళ్లు అద్భుతం చేశారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా నలుగురు అక్కాచెల్లెళ్లు వైద్యులుగా మారేందుకు సిద్ధమయ్యారు. సిద్దిపేట పట్టణం నర్సాపూర్‌కు చెందిన కొంక రామచంద్రం (శేఖర్), శారద దంపతులకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. రామచంద్రానికి రాజు అనే సోదరుడు ఉండేవాడు. అయితే అతను 1992లో జరిగిన ఓ రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. ఆ తర్వాత ఆయన తల్లి మల్లవ్వ గొంతు క్యాన్సర్‌తో మృతిచెందారు. దీంతో రామచంద్రం తీవ్ర మనోవేదనకు గురయ్యారు. తన ఇంట్లో ఒక్క డాక్టరైనా ఉండి ఉంటే తల్లి, సోదరుడిని కాపాడుకునే వాడిని కదా అనుకున్నారు. తన నలుగురు పిల్లల్లో ఒక్కరినైనా వైద్యురాలిని చేయాలని సంకల్పించారు. ఏళ్ల తరబడి భార్యభర్తలు ఇద్దరూ దర్జీలుగా పని చేస్తూ పిల్లలను బాగా చదివించారు. అయితే పెద్ద కుమార్తె మమత ఇటీవల ఎంబీబీఎస్ పూర్తిగా చేసింది. రెండో కుమార్తె మాధురి కరీంనగర్‌లోని చెల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో తుది సంవత్సరం చదువుతోంది. మరో ఇద్దరు పిల్లలు రోహిణి(అక్క), రోషిణి(కవలలు) సైతం తాజాగా ఎంబీబీఎస్ సీటు సాధించి ఔరా అనిపించారు. నీట్– 2024లో రోహిణికి 536 మార్కులు రాగా, రోషిణికి 587 మార్కులు వచ్చాయి. వీరిద్దరూ జగిత్యాల మెడికల్ కళాశాలలో సీటు సాధించారు. నీట్– 2023లోనే రోహిణికి సీటు వచ్చింది. అయితే రోషిణికి మాత్రం రాలేదు. దీంతో చెల్లి బాధపడుతుందని ఆమె కళాశాలలో చేరలేదు. ఇద్దరూ కలిసి ఈసారి అదరగొట్టారు. మంచి మార్కులు సాధించి ఒకే కళాశాలలో సీటు పొందారు. త్వరలో నలుగురూ డాక్టర్లు కాబోతుండడంతో తల్లిదండ్రులు, బంధువుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అయితే తమను చదివించేందుకు తల్లిదండ్రులు చాలా కష్టపడుతున్నారని, వారి నమ్మకాని ఒమ్ము చేయబోమని అక్కాచెల్లెళ్లు చెప్తున్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా వారు మా ఇష్టాన్ని కాదనకుండా ఎంబీబీఎస్ చదవిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ ముగ్గురికీ పెద్ద అక్కనే రోల్ మోడల్ అంటున్నారు. అందరం కలిసి అమ్మానాన్న కల సాకారం చేస్తారని చెప్తున్నారు. పిల్లలు హైదరాబాద్‌లో చదవడంతో చాలా మంది అనేక రకాల మాటలు అనేవారని, వాటిని పట్టించుకోకుండా లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు రామచంద్రం దంపతులు అంటున్నారు. తమ పిల్లలను సరస్వతీ పుత్రులు అని పలువురు కొనియాడుతున్నారని, ఆ మాటలు వింటున్నప్పుడు తమ కష్టాన్ని మర్చిపోతున్నట్లు ఆనంద భాష్పాలు రాల్చారు. ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా వారిని డాక్టర్లగా నిలబెడతామని అంటున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఈ కుటుంబం గురించే చర్చ జరుగుతోంది. పిల్లలు అంటే ఇలా ఉండాలని పలువురు తల్లిదండ్రులు అనుకుంటున్నారు.

# ఏపీలో భారీ వర్షాలు

నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా రాయలసీమ , దక్షిణ కోస్తా జిల్లాలలో భారీ వర్షాలు పడుతున్నాయి. మరోవైపు వాయుగుండం రేపు తెల్లవారుజామున తీరం దాటే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. ప్రస్తుతం చెన్నైకి 190 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 250 కి.మీ, నెల్లూరుకి 270 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పశ్చిమ వాయువ్య దిశగా గంటకు 17 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం కదులుతున్నట్లు వెల్లడించింది. ఇదే వేగంతో కదిలితే రేపు తెల్లవారుజామున చెన్నైకి దగ్గరగా పుదుచ్చేరి, నెల్లూరు మధ్య వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఇక తీరం దాటిన అనంతరం వాయుగుండం క్రమంగా బలహీనపడనుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వాయుగుండం తీరం దాటనున్న క్రమంలో గురువారం దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. మిగిలిన జిల్లాలలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో రేపు కూడా పలు జిల్లాలలో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో కొన్ని జిల్లాలలో స్కూళ్లకు కలెక్టర్లు సెలవు ప్రకటించారు. ప్రకాశం, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పాఠశాలలకు రేపు సెలవు ప్రకటించారు.

# ఏపీలో అన్న క్యాంటీన్ల భవనాలకు రంగు

రాజకీయంగా లబ్ధి పొందటానికి ప్రభుత్వ భవనాలకు పసుపు రంగు వేస్తున్నారని.. ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేస్తున్నారని.. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు ఇది విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో.. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలకు బులుగు రంగు తొలగించాలని తీర్పు ఇచ్చిన విషయాన్ని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రంగులు తొలగించడానికి సమయం పట్టగా.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారని కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగును బట్టి పార్టీని ఎలా డిసైడ్ చేస్తారని ప్రశ్నించింది. అన్న క్యాంటీన్‌కు ఇంతకుముందు ఏ రంగులు వేశారని ప్రశ్నించింది. అనంతరం ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కూడా ఈ రంగుల వివాదం నడిచింది. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయాలతో పాటుగా మరికొన్ని భవనాలకు బులుగు రంగు వేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఏపీ హైకోర్టులో పిటిషన్‌లు దాఖల చేయగా.. సుధీర్ఘంగా విచారణ జరిగింది. చివరికి హైకోర్టు ప్రభుత్వ కార్యాలయాలకు ఉన్న బులుగు రంగును తొలగించాలని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం వెంటనే రంగుల్ని తొలగించింది. ఈ రంగుల వ్యవహారం గత ఐదేళ్లలో పెద్ద వివాదమే అయ్యింది. ఏపీలో 2014-2019లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. అయితే 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. ఈ క్యాంటీన్లను మూసివేసింది.. ఐదేళ్ల పాటూ వాటిని అలాగే వదిలేశారు. అయితే జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడంపై ఫోకస్ పెట్టింది. ముందుగా రాష్ట్రవ్యాప్తంగా గతంలో ఉన్న అన్న క్యాంటీన్ల మరమ్మత్తుల పనులు చేపట్టింది.. ఆ తర్వాత వాటిని రాష్ట్రవ్యాప్తంగా రెండు విడతల్లో ప్రారంభించారు. అయితే 2014-2019 మధ్య అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసిన సమయంలో పసుపు రంగును వేశారు. మూడు నెలల క్రితం ప్రారంభమైన సమయంలో కూడా అన్న క్యాంటీన్‌లకు పసుపు రంగులు వేశారు. దీంతో ఈ రంగుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. మరి అన్న క్యాంటీన్‌లకు పసుపు రంగులపై ఏపీ హైకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుంది.. ఏపీ ప్రభుత్వం ఎలాంటి వాదనలు వినిపిస్తుంది అన్నది ఆసక్తికరంగా మారింది.

# డిఎస్సీ గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఐటీడీఏ జాయింట్ కలెక్టర్ దాత్రి రెడ్డి



జనం రిపోర్టర్ బుట్టాయిగూడెం ఏలూరు జిల్లా ఐటిడిఏ కె.ఆర్. పురం పరిధిలోగల ఏజెన్సీ మండలాల్లోని మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న గిరిజన యువతీ, యువకులకు సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ ఆధ్వర్యంలో ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తెలిపారు. బి.ఇడి/డిఇడి మరియు టెట్ పాసై కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉన్న ఆసక్తికలిగిన గిరిజన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు జ్ఞానభూమి పోర్టల్ లో https://jnanabhumi.ap.gov.in లేదా https://mdfc.apcfss.in నందు నమోదు చేసుకోవాలన్నారు. సదరు ధరఖాస్తులను 6 దశల పరిశీలన అనంతరం అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. కావున ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# బాపట్ల పురపాలక సంఘం,జి. రఘునాథరెడ్డి





**జనం రిపోర్టర్ – బాపట్ల :-** బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని లోతట్టు ప్రాంతాలలో మునిసిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి పర్యటించారు తుఫాన్ నేపథ్యంలో వెన్నెలకంటి నగర్, శారదా పూరి కాలనీ కాలనీ, రాజీవగాంధీ కాలనీ నందు నిలిచిన వర్షపు నీటి తరలింపు ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. నీరు తరలింపు వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున యాంటి లార్వాల్ పిచికారి చేయాలన్నారు. అనంతరం 8 వ వార్డు మల్లిఖార్జున బృందావనం స్మశాన వాటికను సందర్శించారు విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు, కర్మ కాండలకు వచ్చే ప్రజలకు స్నానాలకు నీటి వసతి లేనందున అవసరమైన ఏర్పాట్లు చేయాలనీ ఇంజనీరింగ్ విభాగం వారికి సూచించారు.అనంతరం పలు వార్డులలో పర్యటించి పారిశుద్యం గురించి సిబ్బందికి పలు సూచనలు చేసారు. గృహ యజమానుల వద్ద నుండి తడి,పొడి హానికర వ్యర్థాలను విధిగా ప్రతిరోజు తప్పక వేరు చేసి మాత్రమే సేకరించాలని అన్నారు. బ్లాక్ స్పాట్స్ ని నిత్యం పరిశీలించి క్లియర్ చేయాలని ఆదేశించారు. అనంతరం పలు వార్డులలో పర్యటించారు ఎక్కడ కూడా పారిశుద్ధ్యం విషయంలో అలసత్వం వహించకూడదని సిబ్బందికి సూచించారు. డ్రైనేజీలలో నీరు నిలువ లేకుండా పూడికతీత పనులు నిత్యం చేయాలనీ అన్నారు.తడి, పొడి చెత్త,హానికర వ్యర్థాలను వేరు చేసిన తర్వాతే గృహ యజమానుల వద్ద నుండి సేకరించాలన్నారు. బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి వాటిని క్లియర్ చేయాలన్నారు.వర్షాల నేపథ్యంలో గృహాల వద్ద వుండే గుంతలు, కొబ్బరిబొండాలు, తొట్టెలలో నిలిచి ఉన్న నీటిని తొలగించాలన్నారు.ఈ పర్యటనలో అసిస్టెంట్ ఇంజనీర్ వారు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

# జాడ లేని క్రీడా ప్రాంగణాలు

**– ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్**

**అమరచింత వనపర్తి జిల్లా అక్టోబర్ 16 జనం రిపోర్టర్** అమరచింత మున్సిపాలిటీలో క్రీడా ప్రాంగణాల జాడ లేదని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్ అన్నారు. బుధవారం అమరచింత పట్టణం లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువతలో క్రీడా నైపుణ్యం, క్రీడలపై ఆసక్తి పెంచేందుకు క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. పట్టణంలో పది వార్డులు ఉన్నాయని ప్రతి వార్డుకు ఒక ప్రాంగణం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇంతవరకు స్థలాలను కూడా కేటాయించలేదన్నారు. ప్రస్తుత పాలకవర్గం అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు తొమ్మిది నెలలు అవుతుందని ఇంకొక మూడు నెలలు మాత్రమే కాలం మిగిలిందన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో క్రీడా ప్రాంగణం బోర్డులు పెట్టారన్నారు. ఇప్పుడు ఆ బోర్డులు కూడా కనిపించడం లేదన్నారు. క్రీడా ప్రాంగణాల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బు ఎంత, ఎంత ఖర్చు పెట్టారు, ఎంత అభివృద్ధి చేశారు తదితర వివరాలను వనపర్తి పట్టణ ప్రజలకు మున్సిపల్ చైర్పర్సన్, కమిషనర్ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో అమరచింత మున్సిపాలిటీ ఆఫీస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు విశాల్, విజ్ఞాన్, చేతన్, విజయ్ ,అనురాగ్ ,ఎండి మైబు ,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




# అనంతగిరిలో పల్లె పండుగ పనులు ప్రారంభం

రాజవొమ్మంగి, అక్టోబర్ 16 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండలంలోని అనంతగిరి పంచాయతీలో బుధవారం పల్లె పండగ కార్యక్రమాన్ని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి చేతులు మీదుగా ప్రజాప్రతినిధులు,అధికారులు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనంతగిరిలో 2 గోశాలలు మంజూరు అయ్యాయని తెలిపారు యూనిట్ కాస్ట్ రెండు లక్షల ముపై వేలని,షెడ్స్ నాణ్యంగా కట్టుకోవాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో కింద్ర సర్పంచ్ బూసరి సత్తిబాబు ఎంపిడిఓ యాదిగిరిశ్వరావు,ఏపిఎం సురేష్ కుమార్, వైస్ సర్పంచ్ సూర్యారావు,లబ్ధిదారులు మఠం ప్రవీణ్ కుమార్ దంపతులు,పంచాయితీ సెక్రటరీ సూరిబాబు, కూటమి నాయకులు కె శివ,ఆదిరెడ్డి సత్తిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అప్పారావు,రామలక్ష్మి,గాంధీ, విజయ్ శ్రీ,కె వరలక్ష్మి,కాశీ తదితరులు పాల్గొన్నారు



# రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం




**రాజవొమ్మంగి, అక్టోబర్ 16 జనం రిపోర్టర్:** అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండలం రాజవొమ్మంగి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలోని దాకరాయి,మర్రి పాలెం గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు ఈ వైద్య శిబిరంలో 48 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాని బాబు,లక్ష్మి,సూర్య 104డిఇఓ శ్రీనివాస్,పైలెట్ శివ కనకరాజు,ఆశాలు తదితరులు పాల్గొన్నారు

# దీపావళి పర్వదినం సందర్భంగా తాత్కాలిక టపాసుల దుకాణాల ఏర్పాటు బాపట్ల జిల్లా కలెక్టర్

**జనం రిపోర్టర్ – బాపట్ల :-** బాపట్ల జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ వారైన శ్రీ. జె. వెంకట మురళి ఆదేశాల ప్రకారం దీపావళి పర్వదినం సందర్భంగా తాత్కాలిక టపాసుల దుకాణాల ఏర్పాటు నిమిత్తం బాపట్ల పురపాలక సంఘం నందు గల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల మైదానాన్ని మునిసిపల్ కమిషనర్ జి రఘునాథ రెడ్డి బాపట్ల ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వర రావు వారితో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాల ఏర్పాటు చేయాలన్నారు. టపాసులు కొనుగోలు చేయడానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తీసుకొనే జాగ్రత్తలు గురించి పోలీస్ మరియు ఫైర్ వారితో చర్చించారు. ఆయన వెంట పట్టణ ప్రణాళిక అధికారి యస్.మల్లిఖార్జున రావు, టౌన్ సర్వేయర్ డి. మాధవి,ఫైర్ సిబ్బంది, పాల్గొన్నారు



# సనాతన ధర్మాన్ని కాపాడుటక్కె హైందవ సోదరులు క్షేత్రపాలకులుగా ముందుండాలి



**హసన్ పర్తి మండలం అక్టోబర్ 16 జనం రిపోర్టర్** సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ద్వంసం చేసిన వారిని కటినంగా శిక్షించాలని హసన్పర్తి నగర హైందవధర్మపరిరక్షణ ప్రముఖులు గురుమూర్తి భద్రదేవ్ ఆద్వర్యంలో హసన్పర్తి జాతీయరహదారి యందు నిరసన కార్యక్రమం చేప్పట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి హసన్పర్తి మండల ప్రముఖ పురోహితులు దహగం రమేష్ శర్మ హాజర్కె మాట్లాడుతు అమ్మవారి విగ్రహాన్ని ద్వంసం చేసిన వారెవర్కెన ప్రభుత్వం తక్షణమే కటినంగా శిక్షించాలని అన్నారు. హిందూ దేవాలయాలపై ఇలాంటి దాడులు జరగడం బాధాకరమని అంటు ఆలయాల సంరక్షణకై హైందవసోదరులు క్షేత్రపాలకులగా ఉండాలని, భరతభూమిలో భారతీయ సంస్కృతి,సంప్రదాయ ఆచార వ్యవహార విలువలను కాపాడుకోవడం భారతపౌరుల కర్తవ్యమని,దేశద్రోహులని క్షమించరాదని ద్వజమెత్తి మాట్లాడారు. ఈ నిరసన కార్యక్రమంలో నగర పురోహితులు వేదాంతం సంపతాచార్యులు గురుమూర్తి గురుదత్తు,కాజీపేట వెంకటస్వామి,హసన్పర్తి పెద్దమ్మతల్లి ఆలయ అర్చకులు శ్రీనివాస్,హసన్పర్తి రాజరాజేశ్వరి ఆలయం చైర్మన్ కందుకూరి చంద్రమోహన్,నగర కార్పోరేటర్ గురుమూర్తి శివకుమార్, తదితర హైంధర్మ పరిరక్షణ బృందం ప్రముఖులు పాల్గొని నిరసన వ్యక్తం చేసారు.

# నిత్యం రోడ్డెక్కుతున్న 50 లక్షల ప్రైవేటు వాహనాలు

హైదరాబాద్లో చిన్నపాటి వర్షం కురిసినా గంటలపాటు ట్రాఫిక్లో ఇరుక్కోవాల్సిందే. ప్రజారవాణా తగ్గిపోవడంతో నిత్యం 50 లక్షల ప్రైవేటు వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ఈ పరిస్థితిని అలానే వదిలేస్తే వచ్చే మూడు నాలుగేళ్లలో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంది. వీటికి పరిష్కారం చూపించే బాధ్యతను లియో అసోసియేట్ భుజాన తెలంగాణ ప్రభుత్వం పెట్టింది. ఈ సంస్థ నగర ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకుంటోంది.

# అంగన్వాడీ బిల్డింగ్ ను పరిశీలించిన ఎంపిపి, అధికారులు



**రాజవొమ్మంగి,అక్టోబర్ 16 జనం రిపోర్టర్:** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి మండల కేంద్రంలోని కన్నాయమ్మ పేట అంగన్వాడీ సెంటర్ బిల్డింగ్ సంబంధిత అధికారులకు అప్పగించకుండానే రిపేర్లు చేరుకున్న నేపథ్యంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి,ఎంపిడిఓ ఎల్ యాదగిరి ఈశ్వరరావు ప్రోజెక్ట్ ఆఫీసర్ రవి తేజ పరిశీలించారు ఈ విషయంపై ఎంపిపి మాట్లాడుతూ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ప్రతి సారి ప్రజాప్రతినిధులు ఈ బిల్డింగ్ పై వినతి పత్రం అందజేయడంతో ఈ విషయంపై ఇటీవల జిల్లా కలెక్టర్ స్పందనలో అంగన్వాడీ కేంద్రం మరమత్తులు కోసం జిల్లా కలెక్టర్ వినతి పత్రం ఆమె సమర్పించగా రిపేర్లు చేయించి ప్రారంభించాలని సూచించారని ఆమె తెలిపారు ఈ బిల్డింగ్ 2016, 17 నిర్మాణం పూర్తి చేసినప్పటికీ అంగన్వాడీ అధికారులకు అప్పగించకపోవడంతో ప్రారంభంహొకాకుండానే బిల్డింగ్ ఫ్లోరింగ్ టైల్స్,పాడైయ్యాయని ఆమె అన్నారు ఇటీవల దినపత్రికలో ప్రచురితమవ్వడంతో కలెక్టర్హొ సూచనలతో బిల్డింగ్ పొజీషన్,ఫ్లోరింగ్,టైల్స్,చుట్టూ ఫెన్సింగ్, బోర్ మోటార్ అవసరమని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారని ఆమె చెప్పారు అంచనా నిధులు పొజీషన్ బట్టి కలెక్టర్హొతెలియపరచి పనులు ప్రారంభం చేస్తారని ఆమె తెలియ జేశారు ఈ కార్యక్రమంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్, నాని,అంగన్వాడీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఎస్సీ, ఎస్టీ కేసుల్లో సత్వరమే న్యాయం చేయాలి






**జనం రిపోర్టర్ – బాపట్ల :-** ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులైన వారికి సత్వరమే న్యాయం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. ఎస్సీ, ఎస్టీలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు తప్పనిసరిగా మంజూరు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు. చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తు వేగంగా కొనసాగించాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. రేషన్ కార్డులు లేని వారిని గుర్తించి వారి చేత ఆన్ లైన్ లో దరఖాస్తులు చేయించాలన్నారు. గడిచిన పది నెలలో ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాపట్ల జిల్లాలో 86 కేసులు నమోదయ్యాయన్నారు. ఇప్పటివరకు 68 కేసులలో బాధితులకు రూ.33 లక్షలను పరిహారం కింద నగదు పంపిణీ చేశామన్నారు. ప్రాథమిక దర్యాప్తుతో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. మూడు కేసుల దర్యాప్తునకు హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. పాత ప్రకాశం పరిధిలోని 138 కేసులు బాపట్ల జిల్లా పరిధిలోకి రాగా అవన్నీ కోర్టు పరిధిలోనే పెండింగ్ లో ఉన్నాయన్నారు. బాధితులకు మేలు చేయడానికే చట్టాలు ఉన్నాయని చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య తెలిపారు. బాధితులకు సత్వరమే పరిష్కార మార్గం చూపకపోవడంతో అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాజీపడుతున్న కేసులలో బాధితులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మానవతా దృక్పథం కలిగి చిత్తశుద్ధితో అధికారులు పనిచేయాలని పలు సూచనలు చేశారు. ఎస్సీ ఎస్టీ బాధితుల కొరకు రూపొందించిన చట్టాలను పక్కాగా అమలు చేయాలని, సత్వరమే న్యాయం చేయాలని కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, జి రాజారావు, పి ప్రసాద్ రావు, టి సురేష్, జి నాగమణి కోరారు. కేసులను తక్షణమే దర్యాప్తు చేసి మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ కాలనీలలో స్మశాన భూములు, వీధి విద్యుత్ దీపాలు, రహదారులు, కాలువలు నిర్మించాలని విన్నవించారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ సిహెచ్ సత్తిబాబు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని జె రాజాదెబోరా, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, డిఎస్పిలు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవాలి....

**– మండల విద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు.....**

**– ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం....**



**రామగుండం:జనం రిపోర్టర్** రామగుండం:అక్టోబర్ 16. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనుమతులు లేని ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కొన్ని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు అనుమతులు లేకున్నా,రంగు రంగుల కరపత్రాలతో, హంగు ఆర్భాటాలతో, ఆకర్షించే విధంగా, లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ ,మా పాఠశాలలో చేరితే ఫీజులో రాయితీ కల్పిస్తామని, మాయ మాటలు చెప్పి, చేరిన తర్వాత మొత్తం ఫీజు కట్టాలంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తూ, మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలలకు ప్రభుత్వం నుండి అనుమతులు ఉన్నాయా...? లేవా...? అని తెలుసుకొని చేర్పించాలని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా నడుపుతున్న, ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గొడిసెల ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# పడకేసిన పారిశుద్ధ్యం

**– పారిశుద్ధ్యం క్షిణించి దుర్గం దపూరిత వాసనలు**



**జనం రిపోర్టర్ – బాపట్ల –** బాపట్ల పట్టణంలోని 5వ వార్డు రైలుపేట అపార్ట్మెంట్ పక్క బజారి చివర వెలగా వారి వీధి ప్రజలు మోకాలిలోతు వర్షం నీటిలో త్రీవ ఆగచాట్లకు గురి అవుతున్నారు.గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తమ గృహాల లోకి వర్షం నీరు చేరి విషసర్పలకు నిలయంగా మారాయని వారు తీవ్ర భయాందోళనకు గురిఅవుతున్నారు . అయితే విద్యుత్ లేక బిక్కు బిక్కు మంటూవారు జీవనం కొనసాగిస్తున్నారు.రోడ్లు లేని వెలగావారివీధి ప్రాంతం లో ప్రజలు మోకాళ్ళ దాక నీరుచేరి పారిశుద్యం క్షిణి%శీ%చి దుర్గ%శీ%దపూరిత వాసనలు వేద జల్లుతున్నాయి.ఎన్నోమార్లు తమ సమస్యలు గురించి అధికారులు కు సచివాలయం సిబ్బందికి మున్సిపల్ ఆఫీస్ అధికారులకు విన్నవిచ్చిన వారు నిమ్మకు నీరేత్తినట్లు ఉన్నారని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. మోకాలి లోతు నీటిలో పాదాచారులకునడక కూడా ఇబ్బంది కరంగా మారింది. చినుకు పడితే చిత్తడి గా మారుతున్న ఈ లోతట్టు ప్రాంత మైన ఈ రైలుపేట లో వెలగా వారి వీధి ప్రజల అవస్థలను ఇప్పటికైనా అధికారులు గుర్తేరిగి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని వారుకోరుతున్నారు.

# పల్లె పండుగతో గ్రామాలకు పూర్వ వైభవం

- శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక
- రాబో యే రోజుల్లో ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తాం
- ప్రగతి కోసమే పల్లె పండుగ
- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**జనం రిపోర్టర్, ఎన్టీఆర్ జిల్లా, నందిగామ, అక్టోబర్ 16 :** పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య తెలిపారు. బుధవారం మండలంలోని కమ్మవారిపాలెం, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు జనసేన పార్టీ సమన్వయకర్త శ్రీమతి తంబళ్లపల్లి రమాదేవి అధికారులు మరియు కూటమి నేతలతో కలసి భూమి పూజ చేశారు. తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారం చేపట్టిన వందరోజుల్లోనే పెద్ద ఎత్తున గ్రామాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఒక పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిందన్నారు. మండలంలో 5 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ప్రకటించారు. సుమారు రూ.60లక్షలతో కమ్మవారిపాలెం, రాఘవాపురం, పల్లగిరి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో తాగు నీరు, విద్యుత, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. రాబో యే రోజుల్లో ప్రతి గ్రామానికి మౌలిక వసతులు క ల్పించి అభివృద్ధి చేస్తామన్నారు.

# సీసీ రహదారుల అభివృద్ధికి మూడు పంచాయతీలకు 40 లక్షల మంజూరు



**రేపల్లె అక్టోబర్ 16 జనం రిపోర్టర్** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పల్లె పండుగ వారోత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయని ఎంపీడీవో శోభారాణి తెలియజేశారు . బుధవారం మండలంలోని పెనుమూడి కామరాజు గడ్డ నార్త్ బొందలగరువు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిసి రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. బొందల గురువు పంచాయతీకి 20 లక్షలు కామరాజు గడ్డ నార్త్ పంచాయతీకి పది లక్షలు పెనుమూడి పంచాయతీకి పది లక్షలు రూపాయలు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ మెటీరియల్ కాంపౌండ్ నిధులు మంజూరైనట్లు ఆమె తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామంలోని నాయకులందరూ ఐక్యమత్యంతో ఉండి ఎం జి ఎన్ ఆర్ జి ఎస్ పనులు గుర్తించి వాటిని చేయించుకోవాల్సిన బాధ్యత నాయకులకు గ్రామ పెద్దలకు ఉందన్నారు గ్రామసభ నిర్వహించి గ్రామంలోని సమస్యలను ఒక్కొక్కరు తెలియజేసుకుని ప్రాధాన్యత ప్రకారం పనులను జాబ్ కాదు కలిగిన వారితో చేయించుకుంటే ప్రభుత్వం మెటీరియల్ కాంపౌండ్ కింద ఇచ్చే నగదుతో గ్రామాల్లో కచ్చా రోడ్లను సిసి రోడ్లుగా అభివృద్ధి పరుచుకోవచ్చునని ఆమె తెలియజేశారు సిసి రోడ్లు స్మశానాలకు కాంపౌండ్ వాల్ పొలాలకు వెళ్లే రహదారులు అభివృద్ధి చేసుకోవచ్చని ఆమె సూచించారు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గ్రామ పెద్దలు నాయకులు కృషి చేయాలన్నారు . ఈ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ ఏ ఈ చక్రవర్తి సర్పంచులు గారం విజయ్ కుమార్ టిడిపి నాయకులు ఉయ్యూరు శివ నాగేశ్వరరావు శ్రీనివాసరావు తత్తులు పాల్గొన్నారు

# భద్రాచలంలో ఘనంగా ప్రపంచ అనస్థీషియా డాక్టర్ల దినోత్సవ వేడుకలు




**భద్రాచలం అక్టోబర్ 16 జనం రిపోర్టర్** డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ ( ప్రభుత్వ వైద్యులు, భద్రాచలం ) ప్రపంచ అనస్థీషియా డాక్టర్ల దినోత్సవం సందర్భంగా భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్లో గల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో భద్రాచలం లో ఉన్నటువంటి అనస్థీషియా డాక్టర్లందరూ ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కోటిరెడ్డి చరవాణి లో మాట్లాడుతూ భద్రాచలం లోని అనస్థీషియా డాక్టర్లు మరియు భద్రాచలం లోని ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ సర్జరీలు జరిగేటప్పుడు అనస్థీషియా డాక్టర్ల యొక్క ప్రముఖ్యత మరియు వారి విలువైన సేవలు గురించి కొనియాడారు. డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ అనస్థీషియా రంగంలోని వైద్యులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లోని వారి యొక్క వెలకట్టలేని పాత్ర గురించి గుర్తు చేశారు. డాక్టర్ రమేష్ చంద్ర మాట్లాడుతూ ఆంగ్ల అక్షరమాల లో ,ఏ,మొదటి వరస లో ఎలా ఉంటుందో, ప్రపంచంలోని అనస్థీషియా వైద్యులు మొదటి వరసలో ఉండి మానవాళికి సేవలు అందిస్తున్నారు అని తెలిపారు. డాక్టర్ శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలోని డాక్టర్స్ అందరి యొక్క ఆయువుప్రామాణాలతో పోలిస్తే అనస్థీషియా వైద్యులు తొందరగా మృత్యువాత పడుతున్నా కానీ, మానవాళి క్షేమం కోసం తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా పాటు పడుతున్న అనస్థీషియా వైద్యులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ సురేష్ కుమార్ భద్రాచలం లోని అనస్థీషియా వైద్యులు అందరికీ శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా వైద్యులు అబ్దుల్ లతీఫ్ , నిఖిత, రమేష్ చంద్ర, లోకేష్, మల్లేష్, శివరామకృష్ణప్రసాద్ మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ సురేష్ కుమార్ పాల్గున్నారు. ఈ సందర్బంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు, సిటీ స్టైల్ జిమ్ సభ్యులు శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది.

# పల్లె పండుగ లో సిసి రోడ్డు శంఖుస్థాపన నరేంద్ర వర్మ

**జనం రిపోర్టర్ – బాపట్ల** కర్లపాలెం మండలం బుద్దాం గ్రామం పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని సిసి రోడ్డు శంఖుస్థాపన చేసిన బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, వామా పి.డి. విజయలక్ష్మి, ఈ.ఓ.పి.ఆర్.డి. ఐనంపూడి శ్రీనివాసరావు,ఎం.పి.డి.ఓ అద్దూరి శ్రీనివాసరావు,పంచాయతీరాజ్ ఏఈ రమేష్,గ్రామ సర్పంచ్ ముసలయ్య మరియు నాయకులు,కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం గ్రామ పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని సిసి రోడ్డు శంఖుస్థాపన చేసిన బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ , ఎంఆర్.ఓ మెహర్ కుమార్,ఎంపిడిఓ సత్యనారాయణ,పి.ఆర్.ఎ.ఈ రఘు, గ్రామ పార్టీ అధ్యక్షులు మురళి,వెంకటపతిరాజు,మరియు నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పల్లె పండుగతో గ్రామాల్లో అభివృద్ధి వెలువలు:ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య.



**జనం రిపోర్టర్, ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట, అక్టోబర్ 16 :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తలపెట్టిన " పల్లె పండుగ " కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గం, నందిగామ మండలం, గోల్లమూడి గ్రామంలో ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, అన్న నందమూరి తారక రామారావు, దేవినేని వెంకటరమణ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధి హామీ నిధులనుండి 20 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైన్ ల నిర్మాణానికి స్థానిక నేతలతో కలిసి భూమి పూజ కార్యక్రమం చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ: కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సాధించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు విరజిమ్ముతుందని,ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ టతాతయ్యఈ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరియు అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బుట్టాయిగూడెం మండలం లో నీ పలు గ్రామపంచాయతీలో సిసి రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**జనం రిపోర్టర్ బుట్టాయిగూడెం** ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం కన్నాపురం,కామయ్యకుంట, కోయరాజమండ్రి పంచాయతీ లలో గ్రామస్తులు గిరిజన నృత్యాలతో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు కి ఘన స్వాగతం పలుకుతూ ఆహ్వానించారు.. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు సందర్భంగా గ్రామాల్లో సిసి రోడ్లు మరియు పలు అభివృద్ధి కార్యక్రమంలో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శికరాటం సాయి జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం నాగరికృష్ణ మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు ఏలేటి ఏడుకొండలు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# గుండెపోటుతో నండూరు సర్పంచ్ మృతి.



**పొన్నూరు అక్టోబర్ 16 జనం రిపోర్టర్:** గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం నండూరు గ్రామ సర్పంచ్ అక్కి నాగరాజు బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. పొన్నూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ శ్రేణులు నండూరులోని నాగరాజు గృహానికి వెళ్లి ఆయన పార్తివదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సర్పంచ్ నాగరాజు గ్రామంలో వైయస్సార్ పార్టీ బలోపేతం చేశాడని గ్రామాభివృద్ధికి తన వంతుగా చేసిన సేవలు మరువలేనివని అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు.గ్రామ కార్యకర్తలు సంతాపం తెలిపారు.

# ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి



**అమరచింత వనపర్తి జిల్లా అక్టోబర్ 16 జనం రిపోర్టర్** ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి బుధవారం నర్వ మండల ఎంపీడీవో శ్రీనివాసులు కు స్థానిక బిజెపి నాయకులతో కలిసి వినతి పత్రం అందించారు. నర్వ మండల కేంద్రంలో గతంలో పనిచేసిన మక్తల్ శాసన సభ్యుల నిధులతో నిర్మించిన భవన నిర్మాణంపైనా పెట్టె శిలాఫలకంపైనా ప్రోటోకాల్ ప్రకారంగా పేర్లు పట్టాలని ఎంపీడీఓ ను కోరారు. ఇటీవల ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాలలో కొందరు అధికారులు ప్రజాప్రతినిధులు ప్రోటోకాల్ పాటించలేదని ఈసారి అలా జరిగితే సహించేది లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టి రామ్ రెడ్డి, డీజే రవి, అజిత్ రెడ్డి,విజయరాం, హన్మంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తాము చదువుకున్న గౌరీదేవిపేట పాఠశాలకు1987, 88పూర్వపు విద్యార్థులు ఫర్నీచర్ బహుకరణ.



**ఎటపాకఅక్టోబర్ 16 జనం రిపోర్టర్ .** గౌరీదేవిపేట పాఠశాలలో 1987–88 పదవ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల మిత్ర బృందం అక్టోబర్ 6 నా భద్రాచలంలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గౌరీదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తమవంతు సహాయంగా ఒక బీరువా, మూడు ఎస్ మోడల్ కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కణితి శేఖర్ కు గౌరీదేవిపేట పాఠశాలలో అందుబాటులో ఉన్న వారి మిత్ర బృందం కరి రామ్ నివాస్,బొల్లా ప్రసాదు, అడపా శ్రీను, కొవ్వలి రమేష్, కట్టా సత్యనారాయణ, పసుపులేటి లక్ష్మణరావు,నక్క శ్రీను,పొంది వెంకటరావు ,వసంతాల కళావతి, జింక కృష్ణవేణి ,చంద్రు వెంకటలక్ష్మి ,సారంగి జయలక్ష్మి చేతుల మీదుగా అందించి,అలాగే అనారోగ్యం,ఆర్థిక పరిస్థితుల కారణంగా బాధపడుతున్న వారి తోటి మిత్రుడు జి లక్ష్మయ్య కు రూ.2 వేలు మరియు దుస్తులను అతనికి అందించారు.

# బాపట్ల జిల్లాలో ఉన్న మత్స్యకారులకు తూఫాను హెచ్చరిక



**రపల్లె అక్టోబర్ 16 జనం రిపోర్టర్** బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఉన్నందున రానున్న మూడు రోజులు అనగా ఈనెల 18వ తేదీ వరకు భారీ వర్షాలు మరియు ఆంధ్రప్రదేశ్ తీరమున గాలుల ఉధృతి ఎక్కువగా ఉన్నందున మత్స్యకారులు అందరూ అప్రమత్తము గా ఉండి సముద్రములో వేటకు వెళ్లరాదని మరియు మత్స్యకారులు, బోటు ఓనర్లు తమ బోటులు మరియు వలలను సురక్షితమైన ప్రదేశాలలో భద్రపరుచుకోవలసినదిగా బాపట్ల జిల్లా , మత్స్యశాఖ సహాయ సంచాలకులు , నిజాంపట్నం , సైదా నాయక్ బాపట్ల మత్స్యశాఖ అస్సోసియేషన్లకు, బోటు ఓనర్లకు మరియు మత్స్యకారులకు తెలియజేసారు .. ఈ సందర్భంగా సైదా నాయక్ మాట్లాడుతూ ఇప్పుడే అందిన సమాచారం .మేరకు. వాయుగుండం సూళ్లూరుపేట దగ్గరలో తీరం దాటనుంది. వాతావరణ శాఖ వెల్లడించింది అన్నారు. 16వ తేదీ రాత్రి 11గంటల నుండి రేపు తెల్లవారి జామున 3 గంటల మధ్యలో వాయుగుండం సూళ్లూరుపేట దగ్గరలో తీరం దాటే అవకాశం ఉందనిఈ ప్రభావం సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు మనుబోలు ఎక్కువగా ఉంటుందని అధికారులు చెప్తున్నారు అని తెలియజేశారు. వాయుగుండం తీరం దాటే సమయం లొ వర్షాలు, గాలులు హెవీగా ఉండనున్నాయి. అని అన్నారుఒక మోస్తారు నుండి భారీ వర్షాలు, గాలుల వేగం గంటకు 40%ఎ% నుండి 50%ఎ% మధ్యలో ఉండే అవకాశాలు ఉన్నాయి... ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు

# యాసంగి పంటలకు వచ్చే తెగుళ్ల పై రైతులకు అవగాహన కల్పించిన ఏవో



**అమరచింత వనపర్తి జిల్లా అక్టోబర్ 16 జనం రిపోర్టర్** వచ్చే యాసంగి సీజన్లో రైతులు వేసే పంటలకు ఆశించే చీడపీడల నివారణపై అమరచింత మండల వ్యవసాయ అధికారి అరవింద్ బుధవారం మండలంలోని కొంకని వాని పల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో త్వరలో ఏర్పాటు చేయబోయే వరి కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలు సన్న రకాలు ధాన్యం కొనుగోలు సెంటర్లకు తెచ్చే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. రుణమాఫీ పైన రైతులకు ఉన్నటువంటి సమస్యలు, ప్రస్తుత వరి పంటపై ఆశించినటువంటి సుడిదోమ, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు , పొట్ట కుళ్ళు తెగులు మొదలైన వాటి మీద నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

వచ్చే యాసంగి నారుమళ్ళలో తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రస్తుత పత్తి పంట కోత తర్వాత మినుము పంట సాగు చేయడంలో మెలకువలు , పిఎం కిసాన్ పథకం పై ఉండే సందేహాలను రైతులతో చర్చించి అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోహన్ గ్రామ రైతులు సుధాకర్ రెడ్డి కురుమూర్తి కురుమయ్య గారి నాగరాజు భగవంతు రెడ్డి ఏఈఓ శివ తోపాటు రైతులు పాల్గొన్నారు.

# పల్లె పండుగ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.



**అక్టోబర్ 16. జనం రిపోర్టర్:** గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలోని గోళ్ళమూడిపాడు గ్రామ%శీ% లో జరిగిన పల్లె పండుగ కార్యక్రమం లో జి .చంద్ర శేఖర రావు ,కూటమి నాయకులు పాల్గొని రూ. 3.5 లక్షలు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జూపూడి గ్రామ%శీ% లో రోడ్డు నిర్మాణం కొరకు రూ. 2.50 లక్షల అంచనా వ్యాయంతో శంకుస్థాపన చేశారు. పచ్చలతాడిపర్రు గ్రామ%శీ% లో రోడ్ రోడ్డు నిర్మాణం కొరకు రూ. 3 లక్షల వ్యాయంతో భూమి పూజ చేశారు. అనంతరం కూటమి శ్రేణులు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని వారు పేర్కొన్నారు. మండలంలో సుమారు రూ 10. లక్షల తో అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారి పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు మాదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, బొర్రు రామారావు, మామిళ్ళపల్లి కృష్ణ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


# వంద శాతం ఆస్థి పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవాలి.జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి, సిబ్బంది క్షేత్రస్థాయిలో మరింతగా కృషి చేయాలి..




**రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, అక్టోబర్,16, (జనం రిపోర్టర్)** బల్దియాలో తగు ప్రాధాన్యత కలిగిన శేరిలింగంపల్లి జోన్‌లో ఆస్థి పన్ను వసూళ్లను అత్యంత పకడ్బందీగా వసూలు చేయాలని జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా వంద శాతం చేరుకోవాలని ఆదేశించారు. కొన్ని డాకెట్స్??లలో సాధారణ పురోగతి నమోదవుతున్నదని వాటిల్లో సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. జోన్ పరిధిలో ఆస్థిపన్ను వసూళ్ల పురోగతిపై డీసీలు, పన్ను విభాగం ఏఎంసీలు, ట్యాక్స్??? ఇన్స్??పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి బుధవారం జోనల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరుఆర్‌సీపూర్ సర్కిళ్ల వారీగా ఇచ్చిన లక్ష్యంతో పాటు చేరుకున్న లక్ష్యాన్ని 34 డాకెట్ల వారీగా సమీక్షించారు. అనంతరం జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2024-25 ఆర్థికక సంవత్సరానికి గాను రూ. 749.15 కోట్ల లక్ష్యం నిర్ధరణ కాగా ...ఇప్పటి వరకు రూ. 299.35 కోట్ల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకున్నట్లు పేర్కొన్నారు. వేడుకలు, పలు ఎన్నికలు , పండుగల నేపథ్యంలో కొంత మేర పన్ను వసూళ్ల పురోగతి మందగించిందని, ఇక నుంచి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని జడ్‌సీ సూచించారు. ప్రధానంగా శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లు మరింత పురోగతిని చూపించాలని ఆదేశించారు. కొన్ని డాకెట్లలో పన్ను వసూళ్లు ఆశాజనకంగా లేవని, సంబంధిత ఏఎంసీలు పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టి వేగవంతం అయ్యేలా చూడాలని జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో అయిదున్నర నెలలే ఉన్నందున ఆస్థిపన్ను వసూళ్ల వంద శాతం లక్ష్యాన్ని గడువులోగానే చేరుకోవాలని స్పష్టం చేసారు. ఇక నుంచి ఈ ప్రక్రియపై నిరంతరం సమీక్షలు చేపడతామని, అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకోబోమని జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆస్థిపన్ను వసూళ్లపై అభివృద్ధి పనులు ఆధారపడి ఉన్నందున సిబ్బంది మరింత మెరుగైన పనితీరును కనబరచాలన్నారు..

## అంగరంగ వైభవంగా పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు

**- కన్నుల పండువగా స్వామి, కళ్యాణ మహోత్సవం**





**ఆత్మకూర్ వనపర్తి జిల్లా అక్టోబర్ 16 జనం రిపోర్టర్** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో శ్రీ శ్రీ పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం రోజు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం రోజు స్వామివారి అలంకరణ ఊరేగింపు గ్రామ పెద్ద గేర్ల వెంకట్ రెడ్డి స్వగృహం నుండి ప్రారంభమై పాండురంగ స్వామి దేవాలయం వరకు భజన కీర్తనలతో ఊరేగింపు సాగింది. అనంతరం శ్రీ పాండురంగ స్వామి రుక్మిణి మాత కళ్యాణం గ్రామ పెద్దలు శ్రీనాథ్ రెడ్డి అశ్విని కుటుంబ సభ్యులు కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారి ఆభరణలతో అలంకారం మహా మంగళ హారతి ప్రసాద వితరణ పలు పూజా కార్యక్రమాలు పాండురంగ స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ జోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ శ్రీ పాండురంగ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక ఆరాధన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు నారాయణరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,యుగంధర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,నరసింహారెడ్డి,వినయ్ కుమార్ రెడ్డి,భగవంతు రెడ్డి,గేర్ల వెంకట్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి,అమర్నాథ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి,మనోహర్ రెడ్డి, రుద్రయ్య,గడ్డం భీమన్న,సునంద్ గౌడ్, జంగం కురుమూర్తి,మంగలి లక్ష్మన్న,ముష్టి కురుమూర్తి, నారాయణ,కృష్ణయ్య ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు భక్తులు పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఉచిత ఇసుక

- స్థానిక అవసరాల కోసం ఎక్కడికక్కడ వెసులుబాటు
- నియోజకవర్గంలో తొమ్మిది ఇసుక రీచ్ పాయింట్లు
- అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం
- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**జనం రిపోర్టర్, ఎన్టీఆర్ జిల్లా, నందిగామ,అక్టోబర్ 16 :** ప్రజలకు అవసరమైన ఇసుక, వారికి ఆమోదయోగ్యమైన ధరతో అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది అని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. బుధవారం నాడు కంచికచర్ల మండలం పెండ్యాల -1 ఇసుక రీచ్ (కంచల స్టాక్ పాయింట్) ప్రారంభించారు. నియోజకవర్గంలో 9 ఇసుక రీచులను పెండ్యాల -1,2 వేములపల్లి -1,2, కాసరబాద, పొక్కునూరు-1,2 ఉస్తేపల్లి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. టన్ను ధర 232/- లు అధికారులు పేర్కొన్నట్లు ట్రాక్టర్ ఇసుక 1040/- లు, లారీ ఇసుక 2342/- లకు లభ్యం అవుతుందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చలవేనని తెలిపారు. దీపావళి నుంచి ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించనున్నారు అని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే సీఎం చంద్రబాబు సంక్షేమం అంటే ఏంటో చేసి చూపించారన్నారు. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ పేరుతో శ్రీకారం చుట్టడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారులు, స్థానిక పార్టీ నేతలు కూటమి నాయకులు పాల్గొన్నారు.



## చెన్నూరి శ్రీనివాసు పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలి

**- పుల్ల అశోక్**




**హసన్ పర్తి మండలం అక్టోబర్ 16 జనం రిపోర్టర్** హసన్ పర్తి మండల కేంద్రంలో డ్యూటీలో ఉన్న దళిత మున్సిపల్ మహిళా కార్మికుల ను అకారణంగా బూతులు తిడుతూ,కులం పేరుతో తిట్టిన,గాంధీనగర్ బట్టల బజారుకు చెందిన బట్టల వ్యాపారి చెన్నూరి శ్రీనివాసును వెంటనే అరెస్టు చేసి,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పెట్టి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు మున్సిపల్ యూనియన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి టి ఉప్పలయ్య, కెవిపిఎస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద సంపత్ లు ముఖ్య అతిథులుగా హాజరై రాస్తారోకోని ఉద్దేశించి టి. ఉప్పలయ్య,మంద సంపత్ లు మాట్లాడుతూ గతంలో కూడా ఇదే చెన్నూరి శ్రీనివాసు, మున్సిపల్ జవాన్ గా ఉన్న బిక్షపతిని అకారణంగా కులం పేరుతో తిట్టి దాడి చేయడం జరిగింది. అప్పుడు పెద్ద మనుషులలో మాట్లాడి 30,000 జరిమానా విధించడం జరిగింది. అయినప్పటికీ అతనిలో ఏమాత్రం మార్పు రాక పోగా, మళ్లీ 14వ తారీకు సాయంత్రం నాలుగు గంటలకి మున్సిపల్ పారిశుధ్య పనులలో నిమగ్నమై ఉన్న ముగ్గురు మహిళా దళిత కార్మికులను అత్యంత నీచంగా మాదిగ లంజలు, మదాలెక్కి, జీతాలు పెరగడం వల్ల సరిగా పనిచేయడం లేదని, నాన్న బూతులు తిట్టడం జరిగింది. ఇట్టి విషయాన్ని వారి యొక్క జవాను బొంకూరి నాగరాజు కి చెప్పగా తెల్లారి 15వ తేదీన ముగ్గురు మహిళలను,జవాన్ గా నాగరాజు వెళ్లి మా మహిళలను కార్మికులను ఎందుకు తిట్టావు అని అడిగితే,మీకుమదాలెక్కినాయిరా. అలానే తిడతా ఏం పీకుతారో పీక్కోండి,అని ఆ మహిళల ముందే మహిళలను, నాగరాజు జవాను ను మళ్లీ తిట్టడం జరిగింది. నిన్నంతా పై అధికారులు రావడం వల్ల, ఈరోజు అక్టోబర్ 16న హసన్పర్తి పోలీస్ స్టేషన్లో కేసు పెట్టడం జరిగింది. కులం పేరుతో దూషించిన చెన్నూరి రమేష్ రాజకీయ అండదండలతో,ఎన్ని దండగలైనా కడతాను గాని, నన్ను ఎవడు ఏం చేయలేరని విర్రవీగుతున్న చెన్నూరు శ్రీనివాస్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ పెట్టి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూవెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని, లేనట్లయితే మున్సిపల్ కార్మిక ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా కూడా విస్తరింప చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో సిఐటియు మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్,హసన్పర్తి మండల సిఐటియు కార్యదర్శి పుల్ల అశోక్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి బొంకూరి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సంఘాల రాజు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, మునిసిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా అలాయ్, బలాయ్...సోదర భావంతో ఆప్యాయంగా ఆలింగనం...




**రామగుండం:జనం రిపోర్టర్** రామగుండం:అక్టోబర్ 16. గోదావరిఖని పట్టణంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ (ఎస్వీ ఫంక్షన్ హాల్),సామాజిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో అలాయి బలాయి కార్యక్రమం జరిగింది. సామాజిక ఐక్యవేదిక కన్వీనర్ క్యాతం వెంకటరమణ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ , బిజెపి రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి కందుల సంధ్యారాణి పోచం , సీనియర్ జర్నలిస్టు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు,(గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ) బొంకూరి మధు , బిజెపి సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ మెరుగు హనుమంతు , సహజ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు, మైస రాజేష్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇరుగురాల కృష్ణయ్య , జిల్లా కో కన్వీనర్ శ్రీ దుబాసి బొందయ్య , తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ శనిగారపు, రామస్వామి , రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్ , ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, నటరాజ్ , బిఎస్ఎన్ఎల్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి ఏకు శ్రీనివాస్, సామాజిక వేదిక ప్రధాన కార్యదర్శి ,కోడూరి రమేష్ ,నేతకాని సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అడ్వకేట్, రామ టెంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయాలను సోదరభావాన్ని పెంపొందించేలా అలాయి బలాయి, కార్యక్రమం జరిగిందని వక్తలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కుల మత వర్గ,బేద తారతమ్యాలు లేకుండా, అన్ని వర్గాల ప్రజలతో కార్యక్రమం నిర్వహణ శాంతియుత వాతావరణంలో జరుపుకోవడం పట్ల అతిథులు ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాల నిర్వహించారు. రాగి,సంకటి, అంబలి, రాగి జావా, జొన్న రొట్టె, గుడాలు, మేక, తలకాయ సూప్, కూర సర్వపిండి మొక్క గారెలు గడక, ఎల్లిపాయపాయ కారం, తో తెలంగాణ రుచులు పలువురని ఆకట్టుకున్నాయి.

## కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

**- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**చొప్పదండి,జనం రిపోర్టర్,అక్టోబర్ 17** కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావల్సిన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సాటయం అన్నారు. మండలంలోని కాట్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాల్లోని గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ తో కలిసి ప్రారంభించిన చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావల్సిన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని సరియగు తేమ శాతంతో పాటు తప్ప తాలు లేకుండా తీసుకొచ్చి మొదటి రకం ధరను పొందేలా చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ధోరణిలో ఉంటుందని, కొనుగోలు చేసిన వారం రోజుల్లోపే ధాన్యం డబ్బులను ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండల అధికారులతో పాటు గుర్రం నీరజ, ఇప్పటి శ్రీనివాస రెడ్డి,ముద్దం తిరిపతి,కొత్తూరు మహేష్, రాజేందర్,పురం రాజేశం,పెరుమాండ్ల గంగయ్య,కొట్టె అశోక్,కనుమల్ల రాజశేకర్, ఆకుల సురేష్, నేరట్ల మల్లేష్, గుర్రం రమేష్,పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## పల్లె పండుగలతో గ్రామాలకు పూర్వవైభవం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

**జనం రిపోర్టర్ బుట్టాయిగూడెం** ఏలూరు జిల్లాబీబుట్టాయిగూడెం మండలంలో 4 కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ.. రాష్ట్రవ్యాప్తంగా పల్లెపండుగ పేరుతో ఒకేసారి రికార్డు స్థాయిలో సిమెంట్ రహదారుల నిర్మాణంతో పాటు అభివృద్ధి పనుల నిర్వహణకు చర్యలు తీసుకోవడం ఓ చారిత్రక ఘట్టమని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యులు చిర్రి బాలరాజు సోమవారం భూమి పూజ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఈ పల్లెపండుగలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 4,500 కోట్లతో 30,000 పనులను చేపట్టనుందన్నారు. రాష్ట్రంలోని 13,324 గ్రామాల్లో ఒకేసారి నిర్వహించనున్నారు, ఇది గ్రామీణ అభివృద్ధికి పెద్ద దోహదం చేసే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఏజెన్సీ టైగర్ కరాటం రాంబాబు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం నాగ కృష్ణ జిల్లా కార్యదర్శి గడ్డమును రవికుమార్ మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు ,%వీ=వా% ఎంపీడీఓ ఎన్డీఏ మహాకూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గూగూడు పంచాయతీలో "పల్లె పండుగ"

**- వర్షంలో తడుస్తూనే పల్లె పండుగ**



**జనం న్యూస్, నార్పల:** గత ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండా పోయాయని టిడిపి జిల్లా మైనార్టీ నాయకులు జాఫర్ వలి పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి వైపు రాష్ట్రం వెళుతోందన్నారు. మండలంలోని గూగూడు, నడింపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని బుధవారం అధికారులు, టిడిపి నాయకులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గూగూడు గ్రామంలోని బిసి కాలనీలో 10 లక్షల నిర్మాణ వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి, నడింపల్లి గ్రామంలో 3.5 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ నాయకులు జాఫర్ వలి, గూగూడు కుళ్లాయి స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ తలారి రాజన్న మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పాలకులు సొంత ధనార్జన కోసం పనిచేశారని, గ్రామాల్లో కానీ, రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు సారథ్యంలోని ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, రాష్ట్రంలో మౌలిక సదుపాయాలతో పాటు రాష్ట్రం అభివృద్ధి వైపు ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగావతి, పంచాయతీ కార్యదర్శి కీర్తన, టిడిపి నాయకులు కనుమ కుల్లయప్ప, దేవేంద్ర, కుల్లాయిరెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ డీలర్ ఓబులేసు, స్కూల్ కమిటీ చైర్మన్ కుల్లాయప్ప, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ బాబు, రోసన్న గారి రాజన్న, కుమ్మరి నాగలింగం, శివయ్య, ఆర్. రాజన్న, దుమ్ము రాజు, జి. లక్ష్మీనారాయణ, నాగార్జున, నడింపల్లి నాయకులు గంగాధర్ నాయుడు, వెంకట నాయుడు, చౌడయ్య, బెల్లం వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం తర్వాత కునుకు మంచిదేనా?



చాలా మందికి మధ్యాహ్న భోజనం తర్వాత నిద్రపోవడం అలా కాసేపు కునుకు తీయడం అలవాటు.
మధ్యాహ్న భోజనం తర్వాత జీర్ణవ్యవస్థలో రక్తప్రసరణ పెరుగుతుంది. దీని వల్ల మెదడుకు రక్త ప్రసరణ తగ్గుతుంది. దీని కారణంగా ఒక్కసారిగా నిద్రమత్తు, అలసట వంటి అనుభూతి కలుగుతుంది. అయితే ఇలా పగటి పూట నిద్రపోవడం ఆరోగ్యానికి మంచిదేనా? అనే సందేహం మీకెప్పుడైనా వచ్చిందా.. మధ్యాహ్నం నిద్ర శరీరానికి మంచిదా? చెడ్డదా..? మీ ఆరోగ్యంపై మధ్యాహ్నం నిద్ర ప్రభావం ఎలా ఉంటుందో వంటి వివరాలు నిపుణుల మాటల్లో.. సాధారణంగా 7 నుంచి 8 గంటల నిద్ర మంచిదని వైద్యులు చెబుతుంటారు. చాలా సార్లు ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, ఇతర కారణాల వల్ల ఉదయాన్నే నిద్రలేవాల్సి ఉంటుంది. అటువంటి వారికి మధ్యాహ్నం నిద్ర అవసరం. పెరుగుతున్న పనిభారం, బిజీ లైఫ్‌స్టైల్, ఒత్తిడితో కూడిన పరిస్థితులతో ఉన్న వ్యక్తులకు, మధ్యాహ్నం నిద్ర రిఫ్రెష్‌గా అనిపిస్తుంది. మధ్యాహ్న నిద్ర శరీరాన్ని మాత్రమే కాకుండా మనస్సును కూడా రిలాక్స్ చేస్తుంది. రోజులో దాదాపు 1 గంట నిద్రపోవడం వల్ల శరీరం కండరాలు మొత్తం విశ్రాంతి పొందుతాయి. అలాగే ఈ నిద్ర మైండ్ రిలాక్స్ అవుతుంది. ఆ తర్వాత, రిఫ్రెష్‌గా కనిపిస్తారు. అయితే మధ్యాహ్నం అరగంటకు మించి నిద్రపోకూడదు. దీని కంటే ఎక్కువసేపు నిద్రపోవడం మీ శరీర జీవ గడియారాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. రాత్రి సహజంగా వచ్చే నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. అందువల్ల రాత్రిపూట తగినంత నిద్ర పొందడానికి పగటి పూట అరగంటకు మించి నిద్రపోకూడదు. స్కూల్ విద్యార్థులు 3 గంటల తర్వాత పాఠశాల నుండి ఇంటికి వస్తే,
పడుకునే బదులు.. వారిని ఆడుకోనివ్వాలి. ఇలా చేస్తే రాత్రి త్వరగా నిద్రపోవడం అలవాటు అవుతుంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత పడుకోవడం వల్ల రాత్రి పిల్లల నిద్రకు భంగం కలుగుతుంది.

# వంటల్లో అధికంగా చింతపండు వాడుతున్నారా?



కొన్ని వంటలకు చింతపండు లేకుంటే రుచి బాగోదు. మన వంటలలో దీని ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. చింతపండును రకరకాల వంటల్లో ఉపయోగిస్తుంటారు. చింతపండు రుచి పుల్లగా ఉంటుంది. అందుకే పేరు చెప్పగానే నోటి నుంచి లాలాజలం కారుతుంది. అందుకే పలు రకాల వంటల్లో చింతపడు లేకుండే అసంపూర్ణంగా అనిపిస్తుంది. చింతపండులోలో టార్టారిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సక్సినిక్ యాసిడ్, పెక్టిన్, టానిన్లు, ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్, గ్లైకోసైడ్లు ఉంటాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, రోజుకు 10 గ్రాముల చింతపండు తీసుకోవడం సురక్షితం. ఇంతకన్నా తక్కువ పరిమాణంలో తీసుకున్నా మంచిదే. చింతపండు ఎక్కువగా తీసుకుంటే అనేక సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చింతపండు ఎక్కువగా తీసుకోవడం వల్ల దంతాల నిర్మాణం దెబ్బతింటుంది.
పళ్లపై ఉండే ఎనామెల్ దెబ్బతింటుంది. దంతాలు కూడా బలహీనంగా మారవచ్చు. చింతపండులో టానిన్‌లతో సహా అనేక సమ్మేళనాలు ఉంటాయి. వీటిని జీర్ణం చేసుకోవడం కొంచెం కష్టం. అధిక పరిమాణంలో చింతపండు తీసుకుంటే, కడుపు, జీర్ణశయాంతర ప్రేగులలో యాసిడ్ స్థాయిని పెంచుతుంది. ఇది గ్యాస్, యాసిడ్ రిఫ్లక్స్, ఇతర కడుపు సమస్యలను కలిగిస్తుంది. చింతపండును అధిక మోతాదులో తీసుకోవడం వల్ల శరీరంలో బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుతాయి. మైకం, బలహీనత ఆవహిస్తాయి. గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడానికి ఇప్పటికే మందులు వాడుతున్న వారు చింతపండు తీసుకోవడం అంతమంచిది కాదు. గర్భధారణ సమయంలో చింతపండుకు దూరంగా ఉండటం మంచిది. చింతపండు తీసుకోవడం గర్భిణీ స్త్రీలకు అంత మంచిది కాదు. ఎందుకంటే దీన్ని ఎక్కువగా తింటే శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇది కడుపులో పెరుగుతున్న శిశువుపై ప్రభావం చూపుతుంది. అంతేకాదు పాలిచ్చే తల్లులు కూడా చింతపండు తినకూడదు.

# హార్ట్ బ్లాక్ అంటే ఏమిటో తెలుసా..?

గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిలో 95 శాతం మంది గుండెపోటుతో మరణిస్తున్నారు. వైద్యులు సాధారణంగా గుండెపోటును నిర్ధారించడానికి యాంజియోగ్రఫీని సిఫార్సు చేస్తారు. ఈ పరీక్ష తర్వాత, గుండెలో అడ్డుపడటం (హార్ట్ బ్లాక్) 70, 80 లేదా 90వ శాతంగా నివేదిస్తారు. గుండెలో అడ్డంకులు ఏర్పడితే గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. దీనిని దశల వారిగా విభజిస్తారు. గుండెలోని రక్త నాళాల్లో రక్త ప్రసరణకు అడ్డంకులు ఏర్పడటం, రక్తనాళాలు పూడుకుపోవడం, రక్తాన్ని గుండె సరిగా సరఫరా చేయలేకపోవడం తదితర కారణాల వల్ల గుండెపోటు వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండెలో అడ్డుపడటాన్ని అథెరోస్క్లెరోసిస్ అని కూడా పిలుస్తారు. గుండె అడ్డుపడటం మొదటి దశ.. – ధమనులలో ఫలకం ఏర్పడటం. కొవ్వు, కొలెస్ట్రాల్, ఇతర పదార్థాలతో తయారైన ఈ ఫలకం ధమనులను తగ్గిస్తుంది. గుండెకు రక్త ప్రసరణను తగ్గించడంతోపాటు.. అడ్డంకిగా మారుతుంది..95శాతంగా పేర్కొంటే.. ప్రమాదంలో ఉన్నట్లు అర్థం. ఒక్కోసారి వైద్య అత్యవసర



పరిస్థితి కూడా ఏర్పడవచ్చు.. హృదయంలో 95 శాతం హార్ట్ బ్లాక్ అయినప్పుడు.. శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేంటో తెలుసుకోండి.. ఛాతీలో భారంగా అనిపించడం: గుండె ధమనులలో అడ్డుపడినప్పుడు, ఛాతీ బరువుగా అనిపిస్తుంది. ఇది ఛాతీ గట్టిగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇలా జరిగినప్పుడు చాలా మంది సాధారణం అని అనుకుంటారు. గుండె సక్రమంగా కొట్టుకోలేకపోవడంతో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే సాధారణమైనది కాదని గ్రహించాలి.. ఛాతీ నొప్పి: గుండెపోటు విషయంలో, రోగులు తీవ్రమైన ఛాతీ నొప్పిని అనుభవిస్తారు. ఈ స్థితిలో శరీరంలో రక్తప్రసరణ సరిగా జరగదు. దీని వల్ల ఛాతీ నొప్పి వస్తుంది. అప్పుడు ఛాతీ గట్టిగా – బరువుగా మారుతుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది: గుండెపోటు వచ్చినప్పుడు, రోగి శరీరంలో ఆక్సిజన్ కొరత ఏర్పడుతుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా మారితే, నిర్లక్ష్యం చేయకండి. వెంటనే వైద్యుడిని సంప్రదించండి. అలసట: గుండె ధమనులు మూసుకుపోయినప్పుడు.. ఒక వ్యక్తి ఎటువంటి కారణం లేకుండా అలసిపోతాడు. చాలా మైకము లేదా బలహీనంగా అనిపిస్తుంది. వాంతులు, వికారం వంటి ఫిర్యాదులు వస్తాయి.. ఇలాంటి సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి.. దంతాలు – దవడలలో నొప్పి: గుండెపోటు విషయంలో, రోగులకు ఛాతీలో నొప్పి రావడం సాధారణం. కానీ క్రమంగా ఈ నొప్పి దవడల వరకు చేరుతుంది. ఇదే జరిగితే, ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించండి.

# షుగర్ వ్యాధిగ్రస్తులు దానిమ్మ పండు తింటే ఏం జరుగుతుందో తెలుసా?



దానిమ్మ పండు వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు లాభాలు ఉన్నాయి అన్న సంగతి మన అందరికీ తెలిసిందే. వీటిని చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు వచ్చి ఒక్కరు ఇష్టపడి తింటూ ఉంటారు. కొందరు వీటిని నేరుగా తింటే మరికొందరు జ్యూస్ చేసుకుని తాగుతూ ఉంటారు. అయితే దానిమ్మ పండు ను తరచుగా తీసుకోవడం వల్ల ఎన్నో రకాల లాభాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సైతం చెబుతున్నారు. ఇకపోతే చాలామంది సుగర్ వ్యాధిగ్రస్తులు దానిమ్మ పండు తినవచ్చా తినకూడదా? ఒకవేళ తింటే ఏం జరుగుతుంది ఎక్కువగా తింటే ఏమైనా అవుతుందా అన్న సందేహాలు వస్తూ ఉంటాయి. దానిమ్మలో సహజంగా పోషకాలు పుష్కలంగా ఉన్నాయి, ఇది మొత్తం ఆరోగ్యం, జీవక్రియ, రోగనిరోధక శక్తి మరియు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మీ రోజువారీ ఆహారంలో దానిమ్మ పండును చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానిమ్మ పండులో రక్తం గడ్డ కట్టడానికి ఎముకలు ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడే విటమిన్ కె ఉంటుందట. ఈరోజు వారి ఆహారంలో దానం మనం చేర్చుకోవడం వల్ల అనేక రకాల ప్రయోజనాలను పొందవచ్చు అని చెబుతున్నారు. దానిమ్మ తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటాయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలపై తక్కువ ప్రభావాన్ని చూపుతాయి. తక్కువ GI ఆహారాలు సాధారణంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచివి ఎందుకంటే అవి రక్తంలో గ్లూకోజ్ నెమ్మదిగా ెఎంగడానికి కారణమవుతాయట. దానిమ్మ పండులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా పాలీ ఫెనాల్స్, మంటను తగ్గించడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వంటి ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండవచ్చని చెబుతున్నారు. ఫైబర్ కంటెంట్ దానిమ్మ డైటరీ ఫైబర్ యొక్క మంచి మూలం, ఇది చక్కెర శోషణను మందగించడం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దానిమ్మ పండులో విటమిన్ సి, కె పొటాషియం వంటి అవసరమైన విటమిన్లు ఖనిజాలు ఉన్నాయి, ఇవి మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు దానిమ్మపండ్లు ఆరోగ్యకరమైన ఆహారంలో భాగం అయినప్పటికీ, వాటిని మితంగా తీసుకోవాలి.

# పిల్లలు 'జెమ్స్' తింటున్నారా?



చిన్న పిల్లలు సాధారణంగా పిప్పరమెంట్లు, చాక్లెట్స్, జెమ్స్ వంటివి తింటూ ఉంటారు. ఆ వయస్సులో ఎవరైనా వాటికి ఆకర్షితులు అవుతారు, అందులో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయితే కొన్నిటిని కచ్చితంగా దూరం పెట్టాల్సిన అవసరం ఉంది. వాటి వల్ల ఆరోగ్యం ప్రమాదంలో పడే ప్రమాదం ఉంటుంది. అలా దూరం పెట్టాల్సిన వాటిల్లో మొదటిది జెమ్స్. మీ ఇంట్లో పిల్లలు ఎక్కువగా వీటిని తింటుంటే వాళ్ళ చేత వెంటనే ఆ అలవాటుని మానిపించండి. ఇందులో వాడే పదార్థాలు చాలా డేంజర్. జెమ్స్ ప్యాకెట్ వెనుక మనకి ఎలాంటి పదార్దాలు వాడారు, ఏ కెమికల్స్ ఉపయోగించారు అనేవి పూర్తి వివరాలతో అందిస్తారు. ఇందులో ఎమెల్సీఫైర్స్(414 ,442, 476) అనే కెమికల్ చాలా డేంజర్. ఎలాంటి కలర్స్ ఉపయోగించారు అనేది కూడా అందులో వివరంగా ఉంటుంది. కలర్స్ ని నంబర్స్ ఫార్మటు లో పెడుతారు. 171,102, 133 , 124,127,122,132 ,110 అని ఉంటుంది. వీటిల్లో 171 అనగా తెలుపు రంగు. తెలుపు కలర్ పేరు టైటానియం డయాక్సైడ్. ఈ కెమికల్ ని యూరోపియన్ కంట్రీ లో బ్యాన్ చేసారు. ఈ తెలుగు ఎంత ప్రమాదకరమంటే, మన శరీరం లోని %ణచీూ% ని పూర్తిగా నాశనం చేస్తుంది. అందుకే ఇది ఇతర దేశాలలో బ్యాన్ చేయబడింది. అలాగే 102 అనగా పసుపు రంగు. దీనిని టెట్రాజైన్ అని పిలుస్తారు , ఈ కెమికల్ ని నార్వే దేశం బ్యాన్ చేసి చాలా కాలమే అయ్యింది. ఈ కెమికల్ కారణంగా మనకి ఆస్తమా వంటి సమస్యలు వస్తుంటాయి. 133 అనగా నీలి రంగు, దీనిని జర్మనీ వాళ్ళు బ్యాన్ చేసారు. ఈ కెమికల్ ని ఉపయోగించడం వల్ల దురద వంటి సమస్యలు వస్తాయి. అలాగే 124 ,127 , 122 నంబర్లు ఎరుపు రంగుని సూచిస్తాయి. వీటిని అమెరికా లో బ్యాన్ చేసారు. ఇలా ఇన్ని దేశాల్లో బ్యాన్ చేసిన ఈ కెమికల్స్ ని మన భారతదేశం లో మాత్రం బ్యాన్ చేయలేదు. వాటి అన్నిటిని కలిపి మనం తినేస్తాము, ఇక మన శరీరం లో ఎన్ని రోగాలకు భీజం పడుతుందో మీరే ఆలోచించండి. 5 లేదా 10 రూపాయలకు అందుబాటులోకి వచ్చేస్తుంది, చాలా రుచికరంగా ఉన్నాయని ఇష్టమొచ్చినట్టు పిల్లల చేత తినిపిస్తే వాళ్ళ ఆరోగ్యాన్ని మీ చేతులారా చెడగొట్టిన వాళ్ళు అవుతారు. దయచేసి ఇది గమనించగలరు. పిల్లలకు అసలు బయట ఆహారాలను అలవాటు చేయడం మెల్లిగా తగ్గించండి. ఎందుకంటే ప్రతీ పదార్థాన్ని తయారు చేయడానికి ఏదో ఒక కెమికల్ ని ఉపయోగిస్తారు. అవి శరీరంలోకి వెళ్లిన తర్వాత లేనిపోని రోగాలు వస్తుంటాయి.

# డార్క్ చాక్లెట్.. ఆరోగ్య ప్రయోజనాలు

డార్క్ చాక్లెట్ తినడం వల్ల మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. తీవ్ర మానసిక ఒత్తిడితో పాటు ఆందోళన వంటి సమస్యలను నివారించవచ్చు. మానసికంగా ఎంతో ఆనందాన్ని కూడా పొందవచ్చునని అధ్యయనం తేల్చింది. డార్క్ చాక్లెట్‌లో ఫెనిలేథైలమైన్ వంటి సైకోయాక్టివ్ పదార్థాలు ఉంటాయి. వీటిలో మానసిక స్థితిని నియంత్రించే న్యూరోమోడ్యులేటర్ ఉంటుది. చాక్లెట్ తినేవారిలో చాలా కాలం తర్వాత మానసిక స్థితి మెరుగుపడినట్టు గుర్తించారు. ప్రతిరోజూ కొద్ది మొత్తంలో డార్క్ చాక్లెట్ తినే వారిలో ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండటంతో పాటు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గించినట్టు పరిశోధకులు కనుగొన్నారు.
అంతేకాదు.. బరువు, శరీర కొవ్వు కూడా తగ్గినట్టు గుర్తించారు.డార్క్ చాక్లెట్ రోజుకు అర ఔన్స్ మాత్రమే తీసుకోవాలి. ఆ మొత్తానికి మించి తీసుకున్నా పెద్దగా ప్రభావం కనిపించలేదు. అలాగే, గుండె సంబంధ వ్యాధుల నివారణ అధ్యయనంలో కూడా 0.7 నుంచి 1.5 ఔన్సుల మధ్య తీసుకున్నారు. కొన్ని డార్క్ చాక్లెట్‌లు రుచికి బాగుంటాయి. వీటిలో 40 శాతం కోకో సాలిడ్‌లు ఉంటాయి. అందుకే డార్క్ చాక్లెట్ డార్క్‌గా కనిపించడానికి కారణంగా చెప్పవచ్చు. అధ్యయనాల్లో కనీసం 60 శాతం కోకో ఘనపదార్థాలను కలిగిన డార్క్ చాక్లెట్ నుంచి అతిపెద్ద ప్రయోజనాలను పొందవచ్చునని తేలింది.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY **SIRASALA SURESH KUMAR**, # /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: **APTEL/2023/86845**, E-Mail:**janamnews19@gmail.com**